

# కోరిక తీరిన వేళ

మల్లిరెడ్డి సులోచన

ఆలసటగా ఇంటికి వచ్చిన సారధి హాల్లోనే ఆగిపోయాడు. లోపలినుండి రాధ గొంతు ఖంగుమని వినిపిస్తోంది.

"ఒక్కసారి చెబితే అర్థం కాదూ! నా బిడ్డకా అమ్మవారి అవతారంలాంటి అలంకరణ చెయ్యొద్దని...."

"ఇప్పుడేమయిందే? దాని సరదా కొద్ది అది చేసింది. కాసేపుంచి తీసివెయ్యి" జాన కమ్మ అనసూయపు గొంతు.

"మీ కిష్టమైతే మీ విషయాలలో సర్వ స్వాతంత్ర్యం ఇవ్వండి అత్తయ్యా. నా బిడ్డల విషయములో మాత్రం నాకు కొన్ని ఆదర్శాలున్నాయి," అనుకుంటూ హాల్లోకి వచ్చిన రాధ, సారధిని చూచి గతుక్కుమంది. వెంటనే తన దారి ప్రక్క గదిలోకి మరల్చింది. సారధి గాఢంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళాడు. మలిన వదనముతో పడక గది గుమ్మములో జయలక్ష్మి నిల్చుంది. ఎదురుగా అయిదేళ్ళ సీమ, పసుపురంగు కంచి పరికిణా, నల్ల జాకెట్టు

వేసుకుని మెరిసిపోతోంది. పొట్టి జడ చివర్న జెడ కుప్పెలు వ్రేళ్లాడుతున్నాయి. నుదుట దోసగింజ బొట్టు. బుట్ట బొమ్మలా ఉంది. రాధ కోపానికి కారణం అర్థం అయింది. జయలక్ష్మి వంక జాలిగా చూస్తూ, ఆమెను తప్పుకుని గదిలోకి వెళ్ళాడు సారధి. అతను దుస్తులు మారుస్తుండగానే 'సీమా!' అంటూ రాధ పిలువటం వినిపించింది. అతను కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చేసరికి జయలక్ష్మి కాఫీ తెచ్చింది.

"ఏమండీ! ఈపూట సినిమా కెళ్దామా?"

"ఊ...." అన్నాడు. అతనికి తెలుసు. ఆమె మనసు బాగుండనప్పుడే సినిమాపేరు యెత్తుతుందని. ఆమె బల్లపై నున్న వీక్లీ తిరగేయసాగింది.

"తయారవ్వు అయిదు దాటింది టైము" అన్నాడు. యాంత్రికంగా లేచి, బీరువాలో నుండి చీర తీసి మార్చుకుని, అత్తగారు కూర్చున్న చోటికి వెళ్ళింది.

"సినిమాకి వెడుతున్నా మత్తయ్యా" జానకమ్మ తలాడించింది. భార్యా భర్తలు బయటికి వచ్చేసరికి గదిలో నుండి సీమ పరుగెత్తుకు వచ్చింది. లెల్లని గౌను వేసుకుంది. జడ విప్పదీసిన వెంట్రుకలు ఎర్ర రిబ్బనుతో పోనీటేల్ కట్టబడి ఉన్నాయి. కొన్ని నుదురుపై పడ్డాయి. బొట్టు గాజులు అన్నీ తీసి వేసింది.

"పద్దమ్మా! నేను సినిమాకి వస్తాను" అన్నది. ఆ పిల్లకి తెలుసు సాధారణంగా సాయంత్రం పూట సినిమాకి తప్ప ఎక్కడికి పోదు పెద్దమ్మని.

"సి ని మా కి కాదు సీమా. అలా వెళ్తొస్తాం. నువ్వు అమ్మ దగ్గిర ఆడుకో." అన్నది.

"నేను అలా వస్తాను." సీమ జయలక్ష్మి చేయి గట్టిగా పట్టుకుంది. పనిపిల్ల బుచ్చి సంవత్సరన్నర రాఖేష్‌ను తీసుకు వస్తోంది. దాని చెయ్యి వదిలి పరుగున వచ్చి జయలక్ష్మిని వాటేసుకుని యెత్తుకోమన్నట్టు చేతులు చాచాడు. క్షణం తటపటాయించి వాడిని యెత్తుకుంది. ఆమె చేష్టలు అంతగా నచ్చలేదు సారధికి.

"సమయము దాటిపోతోంది.రా జయా" విసుగ్గా చూచాడు. ఆమెకు ఏం చేయాలో తోచలేదు. ఇద్దరు బిడ్డల్ని నిర్దాక్షిణ్యంగా ఏడ్పించలేదు. ఆ సమయానికే ఆఫీసు నుండి వేణు వచ్చాడు. అతని చేతిలో బొమ్మలు, మిఠాయి పొట్లం చూచి సీమ అటు పరుగెత్తింది.

"డాడీ! నాకూ...." రాఖేష్ దూకాడు. కొడుకును యెత్తుకుని అన్నగారి వంకకు తిరిగాడు.

"త్వరగా వస్తారా అన్నయ్యా? లిబర్టిలో మంచి ఇంగ్లీష్ సినిమా ఉంది. రెండో ఆటకి వెడదాం." వేణు అడిగాడు.

"లేదు వేణూ, మేం మొదటి ఆటకు వెడుతున్నాం." త్వరగా వెళ్ళిపోయాడు సారధి. పిల్లలకు చెయ్యూపి తను వెళ్ళిపోయింది జయ. ఆ రోజు తప్పక ఏదో

గొడవ జరిగి ఉంటుందని ఊహించాడు వేణు.

రాత్రికి సినిమానుండి వచ్చి, అలసిన జయలక్ష్మి ఆదమరిచి నిదురబోయింది. సారథికి నిదుర రాలేదు. అతనికి విపరీతమైన బాధ వేసింది. తనకేం లోటులేకుండా పెంచారు తల్లి, దండ్రులు. అక్క విశాలకు తమ్ముడు వేణుకు సారథి అంటే ప్రేమాభిమానాలున్నాయి. తను తిని నల్గురికి పెట్టగల సంపాదన ఉంది. అసూయా ద్వేషాలకతీతంగా పెంచింది జానకమ్మ తన కొడుకులను. అన్న తమ్ములు కలిసి ఉన్నా యెలాంటి పొర పొచ్చాలు లేవు. ఒకే ఒక కొరత మిగిలిపోయింది. అన్నదమ్ములిద్దరికీ వారం రోజుల తేడాతో వివాహం అయింది. ఆరు సంవత్సరాలు గడిచినా సారథి భార్య జయ సంతానవతి కాలేకపోయింది. రాధకు ఇద్దరు బిడ్డలు. తమ్ముడి బిడ్డలను చూచి అసూయపడేటంత సంకుచితుడు కాడు. కాని జయతో వచ్చింది చిక్కు. ఆమెకు పసి పాపలన్నా, వారిని ఆడించి, ముస్తాబు చేయటమన్నా విపరీతమైన ఆపేక్ష. బజారులో యే ఆటవస్తువు కనిపించినా కొనేదాకా వదలదు. ఒక యింట్లో ఉండటం మూలాన తోడికోడలు రాధ పిల్లలపై విపరీతమైన మమకారం, పెంచుకుంది. జయ రాధల భావాలు, గుణ గణాలు పూర్తిగా వ్యతిరేకాలు. కాలకూట విషమైనా మ్రింగుతూ చిరునవ్వు నవ్వగల అమాయకపు స్త్రీ జయ. ఇతరుల బాధను చూచి ఓర్చుకోలేదు. పంతాలు పట్టింపులు తెలియని ముద్దరాలు. రాధ సంగతి వేరు. తన మాట, తన పంతము ఎలాగైనా నెగ్గించుకుంటుంది. తన వ్యక్తిత్వము పట్ల విపరీతమైన నమ్మకము, అధునాతన భావాలను జీర్ణించుకున్న పడతి. సీమ పుట్టినప్పుడు పేరు దగ్గర వచ్చిన పేచీ ప్రతి రోజూ అవుతూనే వుంటుంది. ఒక్కసారి తోడికోడలు కసురుకుంది కదా ఆమె బిడ్డ జోలి అక్కరలేదని వూరుకోదు జయ.

"వదినా పాపకేం పేరు పెడదాం?" నామకరణోత్సవము నాడు ఉదయం వేణు అడిగాడు. జయ తన్మయత్వముతో బంగారు బొమ్మలా ఉన్న పాపను చూస్తూ తాను కుట్టి తెచ్చిన గౌన్లూ, చేయించిన బంగారపు చిట్టి గాజులు పాపకు తొడుగుతుంది.


"వదినా! నిన్నే" రెట్టించాడు వేణు. యెదుటి మంచంపై పడుకుని-చిరునవ్వుతో వారిని చూస్తున్నాడు సారథి.

"వచ్చేటప్పుడు అత్తయ్య చెప్పింది పార్వతి అని పెట్టమని. అది పాత పేరు. అపర్ణ కూడా పార్వతీదేవి పేరే. అపర్ణ అని పెడదాం." అన్నది.

"గుడ్, చాలా మంచి పేరు." నవ్వాడు వేణు. "యెలావుందన్నయ్యా?"

"బావుందిరా ఏ ఎన్నిక. పాప అమ్మకు కూడా నచ్చాలిగా." అన్నాడు సారథి.

"పాపకు పాలు పట్టాలిట. అక్క తెమ్మంటుంది" రాధ చెల్లెలు పాపను తీసుకుంది. అప్పుడే పాపను వదలాలని లేదు




జయకు. పాపనిచ్చి తనూ వెనకాలే వెళ్ళింది. రాధ మాటలు విని అక్కడే ఆగి పోయింది.

"ఛీ! అమ్మా! పాపకీ బొట్టు, ఆ బట్టలు అవతారంలా ఏమిటి? తీసిపారెయ్యి. బంగారమే తక్కువయిందా...." జయ మనసు చివుక్కుమంది. మూడు రాత్రులు కష్టపడి కుట్టిన బట్టలు.... వెనక్కు తిరిగింది.

నామకరణోత్సవం అప్పుడు బ్రాహ్మడు పేరు అడిగితే, చెప్పమన్నట్టు చిరునవ్వుతో వదిన వంక చూచాడు వేణు. ఈ లోపలే రాధ 'సీమ' అని చెప్పింది. జయ మాట్లాడక నిల్చుంది. ఆ తరువాత ఇలాంటి సంఘటన లెన్నో జరిగాయి. నాల్గు నెలల పాప ఏడుస్తుంది. రాధ నిశ్చింతగా రేడియో వింటుంది. జయ పరుగున వచ్చి సీమను యెత్తుకుంది.

"ఏమిటి రాధా! అది ఏడుస్తుంటే నీకు వినిపించటం లేదా?"

"మొదట పాపను క్రింద పడుకోబెట్టక్కయ్యా." రాధ ఆజ్ఞకు బిత్తరపోయింది జయ. "యెత్తిన పిల్లలు ఒత్తి అవుతారంటారు. అది కాక మీకు జలుబు చేసింది" అదిరిపడి సీమను పడుకోబెట్టింది. ఆ నాటి నుండి సీమకు దూరంగా ఉండాలని ప్రయత్నం చేసింది. వీలు కాలేదు. దగ్గరగా ఉన్న కాలేజిలో డెమాన్‌స్ట్రేటర్‌గా చేరింది రాధ. దినమంతా సీమ పోషణ భారం వహించిన జయ, నాల్గు గంటలు కాగానే అపరాధిలా పిల్లను బుచ్చి చేతికో అత్తగారి చేతికో యిచ్చి తప్పుకునేది. ఒక రోజు మధ్యాహ్నము తలనొప్పి అంటూ సెలవు పెట్టి వచ్చింది రాధ. జయ గోరు ముద్దలుచేసి సీమకు తినిపిస్తోంది.

"అక్కయ్యా! ఎన్నిసార్లు చెప్పాలి అలా చేత్తో తినిపించరాదని. గిన్నెతో

కలిపి స్నానం వెయ్యండి, తిన్నంత తింటుంది." విసుక్కుంది.

"ఇంకో యేడాది పోతే అలాగే తింటుంది రాధా...."

"అలా మీ చేతులకిస్తే పెళ్ళీడుకు వచ్చినా తినిపించమనే అంటుంది. బుచ్చీ! ఎక్కడ చచ్చావ్? నిన్ను పెట్టింది యెందుకు? గచ్చకాయలాడతావా? ఇస్త్రీ చేయని ఫ్రాక్ పాపకు వెయ్యొద్దని చెప్ప లేదూ?"

"జయమ్మగారే స్నానము చేయించారు" భయపడుతూ చెప్పింది బుచ్చి.

"ఊం...." విసురుగా సీమను తీసుకెళ్ళి నాల్గు అంటించి, తిరిగి స్నానము చేయించి నీటుగా ముస్తాబు చేసింది. అన్నము తినిపించాక ఒకేసారి మంచి బట్టలు వేయాలని జయ ఉద్దేశం. కళ్ళల్లో తిరిగిన నీరు అదిమిపట్టి శూన్యహృదయముతో గదిలోకి వెళ్ళిపోయింది.

రాకేష్ పుట్టినప్పుడు జయకు యెంతో సంతోషం కల్గింది. రాధ ఆస్పత్రిలో ఉండగా సీమను అత్యంత ప్రేమగా హృదయానికి హత్తుకుని నిశ్చింతగా నిదుర పోయింది. రాధ ఇంటికి వచ్చింది.

"జయా! నాకు తిరుగ చేతగాదే. రాధ గదిలో పాలు పెట్టిరా" జానకమ్మ చెప్పింది. పాలు తీసుకుని వచ్చింది.

"మీకు తెలియదు. పిల్లలను కోళ్ళలా రెక్కల క్రింద ఇముడ్చుకుని పండుకోరాదు. ఆవిడ చదువుకుందే అయినా ఆరోగ్య సూత్రాలు బొత్తిగా తెలియవు. ఆ యెదుటి మంచంపై సీమను పడుకో బెట్టండి." రాధ వేణుతో అంటుంది.

"రాధా! నీ ఆరోగ్య సూత్రాలేగాని అవతలివారి మనసు గ్రహించవా? పాపం వదిన యెంత చిన్నబుచ్చుకుంటుంది!" వేణు కంఠము తీవ్రంగా ఉంది.

"నా బిడ్డలను క్రమశిక్షణతో పెంచటము నా విధి. దానికెవరు బాధపడినా నాకు అవసరము లేదు" జయ త్వరగా వచ్చి తన గదిలో నిదురబోయే సీమను యెత్తుకుని వచ్చింది. మౌనంగా తోడికోడలి గదిలో పడుకోబెట్టి పాలగ్లాసు బల్లపై పెట్టి పెరట్లోకి వెళ్ళింది. కరువుదీరా ఏడ్చింది. మిణుకు మిణుకుమనే నక్షత్రాలకేసి చూస్తూ యెంతోసేపు కూర్చుంది.

"జయా!" మృదువైన పిలుపు విని ఇటు తిరిగింది. సారథి నిల్చున్నాడు.

"ఇక్కడేం చేస్తున్నావ్? ఇల్లంతా వెతికాను నీకోసం.. ... అదేం కంట్లో నీరెందుకు?" అనునయంగా అడిగాడు. జవాబుగా అతని వక్షస్థలంపై తల వాల్చి బావురుమంది.

"ఏం జరిగింది? రాధ ఏమైనాఅందా?" ఎంతో బలవంతము చేసిన మీదట జరిగిన విషయము చెప్పింది.

"జయా! నువ్వేం ముసలిదానివా? పాతికేళ్ళు నిండలేదూ! అంత నిరాశ దేనికి? ఇక నుండి ఆ పిల్లలను ముట్టుకోకు." అన్నాడు కాస్త తీవ్రంగా.



“ఎందుకో పసిపాపలను లాలించితే అన్నీ మరిచిపోతాను. వారి సాన్నిధ్యంలో స్వర్గమే కనిపిస్తుంది. ఎప్పటికయినా నా కోర్కె నెరవేరుతుందా? మనసారా, తనివి తీరా పాపను ఆడించే తరుణం వస్తుందా?” అమాయకంగా అడిగింది.

“పిచ్చిదానా! తప్పక నీ కోర్కె నెరవేరుతుంది లే” భార్యకు చేయూత నిచ్చి లేపుకుని వచ్చాడు. జయ పిల్లలతో ప్రమేయము పెట్టుకోక మానదు. రాధ యేదో అనక మానదు. అందరూ నిట్టూర్చి ఊరుకుంటారు.

“జయా! చీరలు ఏవో కొనాలన్నావ్?” సారథి ఓ సాయత్రం ఇంటికి వస్తూనే అడిగాడు.

“ఈ రోజు వెడదామా? అయితే పది

నిమిషాల్లో తయారవుతాను...." అన్నట్టే పది నిమిషాల్లో తయారయ్యారు. కొట్టు లోకి వెళ్ళగానే ఓ అయిదేళ్ళ అమ్మాయి జయని ఆకర్షించింది. నల్లంచు గల పసుపు రంగు కంచిపట్టు పరికిణా కట్టుకుని, జడ కుచ్చులు, జూకాలతో బుట్టబొమ్మలా ముద్దు వస్తోంది. అలాంటి ముస్తాబు సీమకు చేస్తే! వెంటనే అలాంటి బట్టకొని ఇంటికి వచ్చి మిషన్‌పై లంగా, జాకెట్టు కుట్టిగాని నిదురపోలేదు. మరురోజు మధ్యాహ్నా మంతా సీమను ముస్తాబు చేస్తూ గడిపింది. బొమ్మలా మెరిసిపోయే సీమను చూచి, పదే పదే ముద్దుపెట్టుకుంది. 'ఈ రోజు తప్పక రాధ ముగ్ధురాలయి చూస్తుంది' అని అనుకుంది.

"బంగారు తల్లీ! నీ ఒంటికి ఏబట్టయినా నప్పుతుందే" అంటూ జానకమ్మ సంబ రంగా మనుమరాలని యెత్తుకుంది. రాధ ఒక్క మాటలో అందరి సంబరము హరించి వేసింది.

సారధి జయ ముంగురులు సవరిస్తూ యెంతోసేపు కూర్చున్నాడు. తనలాంటి వాళ్లెందరో ఉన్నారు. జయలాంటి విచిత్ర వ్యక్తిని యెక్కడా చూడలేదు. దారిలో ఎవరి చంకిన పసిపిల్లలు కనిపించినా విస్ఫారిన నేత్రాలతో చూస్తుంది. వీధిలో యెవరికి పిల్లలు పుట్టినా రాత్రంతా శ్రమ పడి చక్కని దుస్తులు తయారుచేసి యిస్తుంది. నాల్గు గంటలకు వరండాలో నిల్చుని, దగ్గరలో ఉన్న కిండర్ గార్టెన్ బడి వదలగానే, బిలబిల మని సాగిపోయే పసిపిల్లలను చూచి పొంగిపోతుంది. కోడలి చేష్టలకు జాలిగా నిట్టూరుస్తుంది జానకమ్మ. 'దాని కడుపులో ఓ కాయ కాస్తే....' అనుకుంటుంది.


మర్రోజు ఆదివారం. అందరి భోజనాలు ముగిశాయి. జయ ఆఖరున కూర్చుంది. మజ్జిగ అన్నం కలుపుతుండగా రాకేష్ వచ్చాడు. జయ ముందు కూర్చుని నోరు చూపాడు. ఆమె కా క్షణంలో ఏం గుర్తుకు రాలేదు. ఆప్యాయంగా ముద్దలు కలిపి పెట్టసాగింది.

"అక్కా!" రాధ అరిచింది. "వాడిది కడుపా కాగా! అజీర్తి చేసి చచ్చిపోతాడు. యెంగిలన్నం పెడితేనే ప్రేమ వ్యక్తం చేసినట్టా?"

"రెండే ముద్దలు రాధా...."

"ఇంకా సమర్థింపు దేనికి? ఈ కొంప వదిలితే గాని పిల్లలు బాగుపడేటట్టు లేరు...." రాధ మాట పూర్తి అవకముందే కంచము యెత్తుకు లేచిన జయ చెంప చెళ్ళుమంది.

"సిగ్గు అభిమానం లేదూ! ఒక్కసారి చెబితే మనిషివి కాదూ" భార్య యెదురుగా నిలబడి అడిగాడు సారధి. జయ యేం బదులు చెప్ప లేదు. మౌనంగా వెళ్ళి పోయింది. రాధ తెల్లబోయింది. బావగారు అంత కోపగించుకుంటారని యెప్పుడూ అనుకోలేదు. అపరాధిలా తల వంచుకుని నెమ్మదిగా గదిలోకి వెళ్ళింది. రాధ నిర్ఛ




యంగా మాటలు అనటానికి జయే కారణము. ఏదో ఒక మాటపై అభిమానపడి తోడికోడల్ని నాల్గు మాటలంటే అంత చులకన అయ్యేది కాదు. మౌనంగా ఊర్కోవటంతో రాధ మరీ రెచ్చిపోయింది. గదిలో నుండి వేణు కేకలు వినిపిస్తున్నాయి.

"అంత మోజుగా ఉంటే ఏ అనాధను తెచ్చి అయినా పెంచుకోరాదూ? మమతలెరుగని మనుష్యులతో యెందుకు గోల" ఎఱ్ఱబడ్డ కోడలి చెంప వంక చూచింది జానకమ్మ.

సారధి చిరాకుగా మంచముపై దొర్లసాగాడు. రాధ మాటలకంటే జయ ప్రవర్తన అతన్ని బాధించింది. ఆ క్షణమే పిల్లలు వస్తే అన్నీ మరిచి వారికి కావల్సినవి పెట్టి మాటలు పడుతుంది. ఏం మనిషి?

"వక్కపొడి వేసుకుంటారా, తమలపాకులున్నాయి తెమ్మంటారా?" సారధి తలెత్తి చూచాడు. ఇందాక తను కొట్టినందుకు కోపంగాని, అలకగాని ఏం కనిపించలేదామె ముఖంలో.

"జయా!" అనునయంగా పిలిచాడు.

"ఊఁ...."

"నాపై కోపం లేదా?"

"కోపం దేనికి? అభిమాన రహితంగా ప్రవర్తించాను. అది నాలోని బలహీనత, మీరు యెత్తి చూపారు. ఆకులు తెస్తాను ఉండండి," లేచి వెళ్ళిపోయింది.

* *

"అమ్మా! నాకు అదిలాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది." సారధి తల్లితో చెప్పాడు. రెండు నిమిషాలు కొడుకు వంక తేరిపార చూచింది, జానకమ్మ.

"నీ ప్రమేయం లేకుండానే అయిం

చిత్రా! నా దగ్గర అబద్ధం ఆడకు. ప్రయత్నించావు కదూ?" సారధి తల వంగిపోయింది, తల్లి ప్రశ్నకు.

"క్షమించమ్మా! ఆ అమాయకురాలిని ఈసడింపులూ, దూషింపుల నుండి రక్షించటానికి వేరే మార్గం కనిపించలేదు."

"ఇద్దరూ నా కళ్ళముందే ఉంటారని గర్వపడేదాన్ని. ఆయన పోయిన దగ్గిర నుండి మిమ్మల్ని చూచుకు బ్రతికాను." కళ్లు ఒత్తుకుంది.

"దూరమా, భారమా! మధ్య మధ్య వస్తుంటాము." అన్నాడు. అన్నగారి విషయము వేణును అమితంగా బాధించింది. ప్రయాణం అయి వెళ్ళేముందు యెంతో ప్రయత్నం చేసి, వెడుతున్నామని అందరికి చెప్పింది. పిల్లలను బయటికి తీసుకుపొమ్మని బుచ్చికి చెప్పింది. యెటునుండి చూచిందో సీమ పరిగెత్తుకు వచ్చి, జయను వాటేసుకుంది.

"ఎక్కడికి వెడుతున్నావ్ పెద్దమ్మా? నేను వస్తాను." కన్నీటితో పాపనెత్తుకుని ముద్దు పెట్టుకుంది.

"సీమా! నేను పనిమీద వెళ్తానమ్మా. నీవు బడికి వెళ్ళాలి. త్వరగా వస్తాను. రాధా సీమను తీసుకో. పెరుగు లేంది తినరు పిల్లలు జాగ్రత్త." వేణు తడిసిన కళ్ళు ప్రక్కకు తిప్పుకున్నాడు. తను యెన్ని మాటలన్నా, అమాయకంగా పిల్లలక్షేమము కోరే జయ అంటే విపరీతమైన జాలివేసింది రాధకు.

"నా వల్ల పొరపాట్లు జరిగితే క్షమించక్కయ్యా." అంది జయ చేతులు పట్టుకుని. అంతవరకు బిగపట్టిన అశ్రువులు కట్టలు తెంచుకు ప్రవహించాయి. ఆమె మాట్లాడక టాక్సీలో కూర్చుంది. సీమ ఏడుపు టాక్సీ రొదలో కలిసిపోయింది.

జయ వెళ్ళిన వారము రోజులకు ఉత్తరం వచ్చింది. దాన్నిండా బిడ్డలను గూర్చే రాసింది. ఆమె విలువ ఇప్పుడిప్పుడే తెలిసి వస్తోంది రాధకు. పిల్లలు ఒత్తుల్లా వ్రేళ్ళాడ సాగారు. ఆమె పెంచే ఆధునిక విధానము ఒక్కటీ పని చెయ్యాదు. దండించినా, కసురుకున్నా లాభం లేక పోయింది. ఇదివరకు కాలేజీలో నిశ్చింతగా గడిపి, ఇంటికి వస్తూనే తోడికోడలిపై విరుచుకు పడేది. ఇప్పుడు కాలేజీలో ఉన్నా ఇంటిపై ధ్యాసే. జానకమ్మ జయ అన్నీ అందిస్తే పీట వాల్చుకుని పని తెమిల్చేది. ఇప్పుడు వంటకాదు. ఏడు గంటలవరకు నిశ్చింతగా పడుకునే రాధ, అయిదింటకే లేవాల్సి వస్తోంది. ఆమె కసిరింపులకు బుచ్చి పని మానేసింది. సీమను బడిలో చేర్చింది. రాకేష్ ఓ సమస్యగా మిగిలాడు. ఇప్పుడు సాయంత్రం రాగానే జానకమ్మ గొణుగుడు వినాల్సి వస్తోంది. అప్పుడప్పుడు చిర్రెత్తి పిల్లను కొడుతుంది ముసలావిడ. కిక్కురు మనదు రాధ.

* *

"ఏమండీ ఒక్కసారి వెళ్ళి పిల్లలను చూసి వద్దామా?" భర్తకు వక్కపొడి



అందించి అడిగింది జయ.

"తొందరేం, వెడదాం. వచ్చి నెలరోజు లయినా కాలేదు. అయినా నీకు నేనున్నాను. నాపై అభిమానముందా? ఇరవై నాల్గు గంటలూ పిల్లలే కావాలి."

"ఛ. యెంత మాటన్నారు. ప్రేమ అనంతమైన ప్రవాహమండి. యెన్నో చీలికలుగా విడిపోతుంది. ఏమిటో ; పిల్లలను చూడలేక..........పోనివ్వండి మీకు కోపం వస్తుంది." అటునుండి లేచి పోయింది.

ఆమెను ఇరవై నాల్గు గంటలు పిల్లల ధ్యాస నుండి తప్పించాలని, జిల్లాపరిషత్ చైర్‌మెన్‌ను కలిసి ఆమెను గర్ల్స్‌స్కూల్లో టీచరుగా వేయించాడు. పని వత్తిడివల్ల

కొంతవరకు పిల్లల ధ్యాస మరిచిపోయింది. కాని యెక్కడయినా పిల్లల తల్లి కనిపిస్తే చాలు మైమరచి చూచేది. అటునుండి కదిలేది కాదు.

"అంత అదృష్టం....ఆ తల్లి యెంత అదృష్టవంతురాలో కదా. అంతటి భాగ్యం నాకు కలుగలేదు." నిట్టూర్చేది.

"విశాలక్క అడబడుచు డాక్టరు. ఇరవై యెనిమిది సంవత్సరాలు, యింకా పెళ్ళి కాలేదు. ఇరవై ఆరేళ్ళకే ముసలిదానివై పోయావా?" నచ్చచెప్ప చూసేవాడు. కాలము యెవరి కోసము ఆగదు, పరిగెడుతూనే వుంటుంది. అలా పరుగెత్తే కాలం యెన్నో మార్పులు తెస్తుంది మానవ జీవితంలో. ఆ కాలమే నిరాశ చెందిన జయ హృదయంలో ఆశలు చిగురింప జేసింది.

* *

"లేక లేక కలిగిన ఆనందం. ఆ పల్లెటూరుకు పంపి అమ్మాయికి అసౌకర్యం కలుగచేయటం ఇష్టం లేదు అన్నయ్యా." జయ తండ్రి, కూతుర్ని పురిటికి పిలుచుకుపోవటానికి వస్తే జానకమ్మ అడ్డు చెప్పింది.

"మిగిలిన పిల్లలంతా అక్కడే పురుడు పోసుకున్నారు. జయ తల్లి బాధ పడుతుంది."

"ఫరవాలేదు. వదిననే యిక్కడికి పంపించు." వియ్యపురాలి మాట కాదనలేక వెళ్ళిపోయాడు అతను. జయలక్ష్మి బజారంతా తిరిగి బుట్టలనిండుగా రకరకాల బొమ్మలు కొన్నది. ఆమె కంటే, ఆమె కోరిక తీరుతుందని సారధి అమితంగా సంతోషించాడు. వేణు కెప్పుడూ హృదయము వుండుగా వుండేది. ఇప్పుడు తేలికగా, హృదయపూర్వకంగా మాట్లాడుతున్నాడు. కాలము తెలిపిన అనుభవాలు రాధను మార్చివేశాయి. మళ్ళీ తన యిల్లు కొడుకులు కోడళ్ళతో కలకలలాడుతుంటే జానకమ్మ ఆనందబాష్పాలు రాల్చింది.

"ఏమండీ! స్టాండు ఉయ్యాల నాకేం నచ్చలేదు. వేరే ఉయ్యాల కొని హాల్లో కడదామా?"

"అలాగే జయా." పేపరు చూస్తూనే చిరునవ్వుతో అనేవాడు సారధి. అతను రెండు నెలలు సెలవుపెట్టి ట్రాన్స్ఫర్ కోసము ప్రయత్నము చేస్తూ ఇంట్లోనే వున్నాడు.

"ఇదిగో ఉత్తరము వింటారా? రంగు రంగుల బొమ్మలు కుట్టిన చక్రం తెమ్మని అమ్మకు రాశాను. మా ఊళ్ళో భలేగా తయారు చేస్తారండి."

"చూడండి దుప్పటిపై ఎంబ్రాయిడరీ యెలా వుంది?"

"ఈ మెరుగు పూసలు ఎలాఉన్నాయి. పసిపిల్లలకు కాళ్ళకు, చేతులకు కడితే

ఆడుకుంటుంటే మెరుస్తాయండీ." రోజుకో వస్తువు పసిపిల్లలా భర్తకు చూపేది.

"ఇవ్వెప్పుడు కొన్నావు?"

"రాకేష్ పుట్టినప్పుడు కొన్నాను. రాధ కష్టం ఉండదని దాచాను." అన్నది.

"నీ కోరికలు తమాషాగా ఉన్నాయి." నవ్వేవాడు. చాటుగా సీమను పిలిచి, ఒడిలో కూర్చోబెట్టుకునేది.

"సీమా! నీకు చెల్లాయి కావాలా, తమ్ముడా?"

"తమ్ముడున్నాడుగా. చెల్లాయి కావాలి." సీమ అనేది. ఆ పిల్లను గట్టిగా ముద్దిడుకుని. "నీ దెంత బంగారపు హృదయమే. భేదమే తెలియదు." అలా అలల మీద తేలిపోతూ గడిపింది.

ఆ రోజు నలతగా ఉందని ప్రయివేటు నర్సింగ్‌హోమ్‌లో చేర్పించారు జయలక్ష్మిని. విపరీతమైన ప్రసవవేదన అనుభవిస్తున్నా, ఆమె ముఖాన వింతకాంతి, పెదవులపై చిరునగవు జీరాడుతూనే ఉంది. లేబర్ రూమ్‌లోకి తీసుకుపోతుంటే, సారధి ధైర్యంగా ఉండమని చెయ్యి నొక్కి చెప్పాడు. రాధ అరకప్పు బార్లీ త్రాగించింది. అరగంట గడిచాక నర్సు బయటికి వచ్చి ఫోన్ కోసము పరుగెత్తుతోంది. సారధి ఆత్రంగా ఆమె ఒంక చూశాడు.

"మేల్ చైల్డ్....తల్లికి ప్రమాదంగా ఉంది. డాక్టర్ గణేశన్‌కు ఫోన్ చెయ్యాలి." సారధి గుండెలో రాయి పడింది. దూరంగా కూర్చుని కాలక్షేపానికేదో చదువుతున్న రాధ దగ్గరకు వెళ్ళి వార్త చెప్పాడు.

"కాస్త వయసు ముదిరినాక కాన్పు అయితే కష్టమే బావగారూ. కంగారేం లేదు" అన్నది. ఈ లోపల జానకమ్మ, వేణు అందరు వచ్చారు. గణేశన్ బయటికి వెళ్ళాడని జవాబు వచ్చింది. వేణు తనకు తెలిసిన మరో సర్జన్ దగ్గరకు పరుగెత్తాడు. నర్స్ సారధి దగ్గరకు వచ్చింది.

"ఆవిడ మిమ్మల్ని చూడాలంటున్నారు...." ఆత్రంగా సారధి లోపలికి వెళ్లాడు. పసివాడితో పెరిగిన మాయను బయటకు తీయాలని డాక్టర్ ప్రయత్నం చేస్తోంది. అలసటగా అటు, ఇటు చూస్తోంది జయ. భర్తను చూచింది. ఆమె కళ్ళు ఆనందంతో మూతలు పడుతున్నాయి. బలవంతంగా విప్పింది.

"మనకు.........మనకు బాబండి...." అన్నది.

"విన్నాను జయా. యెందుకు పిలిచావు?"

"బాబును....చూడాలని లేదూ—" అంటూనే మైకంలో పడిపోయింది.

"డాక్టర్!" అదుర్దాగా పిలిచాడు.



"ఇప్పుడే మార్ఫియా యిచ్చాం. ఆపరేషన్ చెయ్యాలి. మీరు వెళ్ళండి" చేసేది లేక బయటికి వచ్చాడు. అందరూ ప్రాణాలు బిగపట్టుకుని నిల్చున్నారు. అరగంట గడిచినా ఏ వార్త రాలేదు. మరో అరగంటలో వేణు డాక్టర్‌ను తీసుకుని వచ్చాడు. డాక్టర్ గ్లవుస్ తొడుక్కుంటూ లోపలికి వెళ్లాడు. వేణు ఆదుర్దాగా లోపలికి చూశాడు. జయలక్ష్మి శరీరాన్ని ధవళ వస్త్రముతో ఆచ్ఛాదితము చేసి, మలిన వదనముతో గోడకు జారగిల బడింది డాక్టర్.

"వదినా!" వేణు అరుపుకు ఆస్పత్రి దద్దరిల్లింది. అందరు ఉలిక్కిపడ్డారు.

*　　　*

ఇల్లంతా, చీకటి రాజ్యం చేస్తోంది. జయలక్ష్మి కోరికోరి నట్టింట కట్టించుకున్న ఉయ్యాలలో పసివాడు ప్రపంచముతో పని లేదన్నట్టు నిదరబోతున్నాడు. వెనకవైపు వరండాలో నేలపై పడుకుంది జానకమ్మ. పిల్లలిద్దరూ బిక్కు, బిక్కు మంటూ చూస్తున్నారు. గదిలో మంచంపై పడుకుని పై కప్పుకేసి చూస్తున్నాడు, సారధి. తమ గదిలో ఎదురుగా పడకకుర్చీలపై మౌనంగా కూర్చున్నారు రాధ, వేణు. వంటింట్లో మౌనంగా వంట ప్రయత్నం చేస్తోంది విశాల. దూరపు బంధువులావిడ యెవరో ఇంట్లో దీపాలు వెలిగించింది. ఒక్కసారి దీపపు కాంతి కళ్ళపై పడగానే కేరు, కేరు మన సాగేడు పసివాడు. తనింటి లక్ష్మిని పొట్టన పెట్టుకున్నాడని జానకమ్మకు పసి వాడంటే నిరసన. ఏడ్పువిన్నా లేవలేదు. రాధ లేవబోయింది. "నా బిడ్డను తాకకు!" యెవరో అజ్ఞాతంగా పలికినట్టయి, అలాగే కూలబడి పోయింది. ఏడేళ్ళ సీమ పరుగున వచ్చింది.

"ఏడవకురా.... రేపు పెద్దమ్మొస్తుం దిగా.... నేను పిలుస్తాను...." అంటోంది ఉయ్యాల కదిలిస్తూ. వాడి కవేం తెలియవు. ఏడ్పు హెచ్చింది. 'జయ పోసిన ప్రేమరస మింతా సీమలో మిగిలింది కాబోలు.' అనుకుని లేచాడు సారధి. వచ్చి కొడు కును యెత్తుకుని ఊరడించ బోయాడు. సాధ్యం కాలెదు.

"అమ్మా...." తల్లి వైపు వెళ్ళాడు.

"పెంటదిబ్బలో పారెయ్యండి. నా లక్ష్మిని పొట్టన పెట్టుకున్నాడు." బావురు మంది జానకమ్మ. సారధికి విపరీతమైన కోపం వచ్చింది. జయ వింటే? విన దుగా! త్వరగా, ఏడ్చే పిల్లడిని తీసుకుని రాధ గదివైపు వెళ్ళాడు. అకస్మాత్తుగా బావగారి రాక చూచి ఆశ్చర్య పోయింది రాధ. తడబడుతూ లేచి నిల్చుంది.

"రాధా! జయకేం తెలియదని, పిల్లల పెంపకము రాదని అంటూ అవమానపరిచే దానివిగా? అందుకే జాగ్రత్తగా పెంచమని వీడిని వదిలిపోయింది తీసుకో" అన్నాడు. వేణు ముఖం ప్రక్కకు తిప్పుకుని, కళ్ళు ఒత్తుకున్నాడు.

"బావగారూ...." రాధ అతని పాదాల దగ్గర కుప్పలా కూలిపోయింది. వంగి ఆమె ఒడిలో పిల్లడిని వదిలి, స్రవించే అశ్రువులను ఒత్తుకుంటూ వెనక్కు తిరి గాడు సారధి.

రాధ మనసులో యెన్నో ఆలోచనా తరంగాలు లేస్తున్నాయి. కాని వాటిని ప్రక్కకు నెట్టి పసివాడిని సాకుటకు లేవక తప్పలేదు. "అక్కయ్యా! నన్ను క్షమించు...." అనుకుంది, వాడిని గుండె లకు హత్తుకుంటూ.

———